క్లుప్తంగా

సరైన పత్రాలు లేని 35 వాహనాల సీజ్

మర్రిపూడి: మైనర్‌లకు వాహనాలు ఇస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నుంచి కాపాడటమే కాకుండా మైనర్‌ల వల్ల ప్రమాదాలు జరగకుండా ఉండాలనే ఉద్దేశంతో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని 35 వాహనాలను గుర్తించి సీజ్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచినట్లు ఆయన తెలిపారు.

సమగ్ర సేద్యంతో సుస్థిర ఆదాయం

కొండపి: గో ఆధారిత, సేంద్రియ సాగుతో పండించే పంటల ఆహార ఉత్పత్తులతోనే మానవాళికి ఆరోగ్య రక్షణ అని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి రంజిత్ అన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లానింగ్‌లో భాగంగా మండలంలోని పెరిదేపి గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, లాభాల గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల, బీపీఏ శ్రీకాంత్, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

పీసీపల్లి: మండల పరిధిలోని భర్త లేదా భార్య ఏదైనా కారణం వల్ల మరణిస్తే, అలాంటి వారు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ప్రభాకర్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 01-12-2023 నుంచి 31-10-2024 సంవత్సరం మధ్యలో మరణించిన వారు మాత్రమే సంబంధిత మరణ ధ్రువీకరణ పత్రం, భర్త ఆధార్ కార్డు, భార్య ఆధార్ కార్డు, పెన్షన్ పుస్తకం, రేషన్ కార్డు జిరాక్స్‌తో వివరాలతో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని వినతి

పొన్నలూరు: మండలంలో 108 వాహనం ద్వారా వైద్య సేవలందిస్తున్న పైలెట్, ఈఎంటీ సిబ్బందికి ప్రత్యేకంగా విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ పుల్లారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పైలెట్ వాసుబాబు మాట్లాడుతూ 108 వాహనం ద్వారా 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్న సిబ్బందికి విశ్రాంతి సమయంలో సేద తీరడానికి భవనం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో 108 సిబ్బంది నాగబాబు, సుబ్బయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సహజ సాగుతో రైతులకు లాభాలు



టంగుటూరు: సేంద్రీయ సాగు ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులతో ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించవచ్చునని ప్రకృతి వ్యవసాయ అధికారులు వెంకట్రావు, విజయలక్ష్మి అన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లానింగ్ (కేపీపీ) లో భాగంగా మండలంలో విస్తృతంగా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కందులూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, లాభాల గురించి ఏపీసీఎన్ ఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వీఏఏ సుజాత మాట్లాడుతూ ప్రతి మహిళా రైతు ఇంటిదగ్గర స్థలంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకొని ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం గ్రామంలో మూడేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న మహిళా రైతు దామచర్ల వెంకట రమణమ్మను సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు సుజాత, మరియమ్మ, పద్మావతి, శృతి, కవిత, జోత్స్న, రమాదేవి, త్రివేణి, హరిత పాల్గొన్నారు.

గుడిసెల తొలగింపుపై నిరసన

కనిగిరిరూరల్: మండలంలోని ఈదల వాగు వద్ద గల ప్రభుత్వ స్థలంలో తాము ఎన్నో ఏళ్లుగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నామని.. కొందరు రియల్టర్లు, నాయకులు అన్యాయంగా తమ గుడిసెలను తొలగించారని ఆరోపిస్తూ అక్కడి నివాసితులు శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం సీపీఎం జిల్లా మాజీ నాయకులు పీవీ శేషయ్య విలేకర్లతో మాట్లాడుతూ హాజీపురం వద్ద ప్రభుత్వ భూమిలో గత 25 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలైన, పాముల కులానికి చెందిన వారి గుడిసెలను రియల్టర్‌లు కూల్చివేయడం ఆటవిక చర్యగా అభివర్ణించారు. అక్రమ వెంచర్లు వేస్తున్న రియల్టర్‌లపై చర్యలు తీసుకోవాలని. సర్వేనం 539లో పేదల గుడిసెలు తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బాధ్యతగా పనిచేయాలి

హనుమంతునిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలు విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా ప్రతి కార్యకర్త బాధ్యతగా పని చేయాలని వెలిగండ్ల సీడీపీఓ కృపావరం అన్నారు. శుక్రవారం మండల కేంద్రం హనుమంతునిపాడులో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల సెక్టార్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు బాలింతలకు, గర్భిణులు, చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలన్నారు. అనంతరం సీడీపీవో సరోజినిని సత్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు షేక్ గౌసీసా బేగం, కార్యకర్తలు రాధమ్మ, లలితమ్మ, సరస్వతి, సుజాత, ఆదిలక్ష్మీ, తిరుపతమ్మ, చెన్నమ్మ ఉన్నారు.

మలేరియా నియంత్రణకు కృషి చేయాలి



కనిగిరిలో ర్యాలీలో మాట్లాడుతున్న చైర్మన్ గఫార్, డాక్టర్ సృజన



పొన్నలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- ప్రపంచ మలేరియా దినోత్సవం
- ర్యాలీలు నిర్వహించిన అధికారులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది

పొన్నలూరు/కొండపి/మర్రిపూడి/సింగరాయకొండ/టంగుటూరు:

గ్రామాల్లో మలేరియా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ కృష్ణచైతన్య అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పొన్నలూరులో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే మలేరియా వంటి వ్యాధులు సోకకుండా ఆరోగ్యవంతంగా ఉంటామన్నారు. చేతిపంపులు, మురుగు కాలువలు, నీటి నిల్వలు ఉన్న చోట మలేరియా వ్యాధి కారక లార్వాలు ఉంటాయని, లార్వాల నివారణ కోసం ఆయిల్ బాల్స్‌లను వేయాలన్నారు. నీటి తొట్లను శుభ్రపరిచి క్లోరినేషన్ చేసి ఆ నీటిని మాత్రమే ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రవికిరణ్, మల్లికార్జునరావు, సీహెచ్ఓ సుబ్బారావు, ఆరోగ్య పర్యవేక్షకుడు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

☛ దోమలు కుట్టకుండా, పుట్టకుండా చూసుకోవాలని కాకర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారిణి సాయి రుచిత తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీకాంత్, శ్రీనివాసకుమారి, వీరాంజనేయులు, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

☛ సింగరాయకొండలో వైద్యాధికారి డాక్టర్ ధీరేందర్‌కుమార్ ఆధ్వర్యంలో కందుకూరు రోడ్డు సెంటర్‌లో మలేరియా దినోత్సవం సందర్భంగా చేపట్టిన అవగాహన ర్యాలీ చేపట్టారు. డాక్టర్ చైతన్యకృష్ణ, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ ఆలీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

☛ దోమలు వృద్ధి చెందకుండా, దోమ కాటుకు గురికాకుండా, జాగ్రత్తలు చేపట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి. అనూష అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా పెట్లూరు గ్రామంలో సిబ్బంది మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా 'అంతం-మన పంతం, మలేరియా నివారణ- మనందరి బాధ్యత' అంటూ నినాదాలు చేసి ప్రజల చేత మలేరియా నివారణ ప్రతిజ్ఞ చేపించారు. కార్యక్రమంలో లక్ష్మీనరసింహం, కాంతారావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ వర్కర్లు, వైద్యశాల సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

పీసీపల్లి/పామూరు/హనుమంతునిపాడు/కనిగిరి రూరల్: మలేరియా రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరు భాగ స్వామ్యులు కావాలని మున్సిపల్ చైర్మన్ గఫార్, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ సృజన అన్నారు. జాతీయ మలేరియా దినోత్సవం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు, డీపీఎంఓ ప్రసాద్‌రెడ్డి, సంస్థల ప్రతినిధులు ప్రవీణ్, రమేష్, ఉమామహేశ్వరరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

☛ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీసీపల్లి వైద్యాధికారి యశ్విత అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా ఆశా వర్కర్లతో స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సంధ్య, రేణుక, జకరయ్య, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

☛ మలేరియా నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మండలంలోని బొట్లగూడూరు ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ రవళీ ప్రియాంక అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా బొట్లగూడూరు గ్రామంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా దోమకాటుద్వారా వ్యాపించే ఒక అంటువ్యాధి అన్నారు. ముఖ్యంగా తాగిపారేసిన ఖాళీ కొబ్బరి బోండాలు, వాహనాల టైర్ల లోపక్కగాని నీరు నిల్వ ఉండి మలేరియాను కల్గించే దోమలు పెంపుదల అయ్యే అవకాశముందన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడటంగాని ఇతర జాగ్రత్తలుగానీ తీసుకుని దోమలు కుట్టకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రవళిప్రియాంక, డాక్టర్ రుబీనా, హెచ్ఈఓ ఎస్.బ్రహ్మానందం, పెరుగు శ్రీధర్, పీహెచ్ఎన్ సరళ, ఎంపీహెచ్ఎస్ విజయనిర్మల, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

☛ టంగుటూరులో పీహెచ్‌సీ డాక్టర్ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో మలేరియా దినోత్సవం సందర్భంగా సిబ్బందిచే అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు జయలక్ష్మి సీహెచ్ఓ మాతయ్య, వైద్య సిబ్బంది సుమతి, పెంచులమ్మ పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): మలేరియా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యతని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల డాక్టర్ సందిరెడ్డి మురళి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం సీఎస్‌పురంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంగయ్య, ఆవుల మురళి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



బొట్లగూడూరులో మలేరియాపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



మాట్లాడుతున్న పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు అనూష



కాకర్లలో మలేరియా వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయి రుచిత



టంగుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ ప్రసాద్‌బాబు



సింగరాయకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది



పీసీపల్లి వైఎస్సార్ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

అనధికారికంగా పొగాకు అమ్మకూడదు



కొండపిలో రైతులతో మాట్లాడుతున్న వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్



వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి శ్రీనివాసరావు

కొండపి: రైతులు అనధికారికంగా పొగాకు అమ్మకూడదని.. శీతల గిడ్డంగుల్లో ఉన్న బేళ్ల వివరాలు తెలపాలని వేలం నిర్వహణ అధికారి జీ సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం వేలం సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ దగ్గర ఉన్న బేళ్ల వివరాలను బోర్డుకు తెలపాలని, అనధికారికంగా పొగాకును అమ్మరాదని సూచించారు. శుక్రవారం నిర్వహించిన వేలంలో అయ్యప్ప రాజుపాలెం, నరసరాజుపాలెం, పెద్దకళ్లగుంట గ్రామాలకు చెందిన రైతులు 806 బేళ్లను వేలానికి తీసుకొని వచ్చారు. అందులో 667 బేళ్లు కొనుగోలుయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 139 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ. 280, కనిష్ఠ ధర కేజీ రూ.225, సరాసరి ధర కేజీ రూ 260.11గా నమోదైంది. వేలంలో 18 కంపెనీలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

112 పొగాకు బేళ్ల తిరస్కరణ..

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో జరిగిన వేలంలో వివిధ కారణాలతో 112 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. శుక్రవారం కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 762 బేళ్లను వేలాని తీసుకురాగా వాటిలో 650 కొనుగోలు జరగగా, 112 బేళ్లు తిరస్కరణ జరిగాయి. గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 225 పలకగా, సరాసరి రూ. 265.81 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 19 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఉగ్రదాడికి నిరసనగా క్యాండిల్ ర్యాలీ

పామూరు: జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాం దగ్గర పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మండల కేంద్రమైన పామూరులో సుందరయ్య భవన్ వద్ద నుంచి ప్రధాన వీధుల్లో సీపీఎం నాయకులు, కార్యకర్తలు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మండల కార్యదర్శి ఖాదర్‌బాషా మాట్లాడుతూ పర్యాటకులపై దాడులు జరిపి వారి మృతికి కారకులైన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కే.మాల్యాద్రి, సీహెచ్. వెంకటేశ్వర్లు, వైవీ నారాయణ, రబ్బాని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాం దగ్గర పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ యూటీఎఫ్, పెన్షనర్ల సంఘం, మానవతా సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పీ రమణారెడ్డి, ఎస్‌కే ఖాజా రంతుల్లా, మీగడ వెంకటేశ్వరరెడ్డి, వీ మాలకొండారెడ్డి, కే కృష్ణమూర్తి,తమ్మినేని పెద్దిరెడ్డి, నరసింహారావు, వెంకటరెడ్డి, చెన్నారావు, పట్నం నర్సింహులు, బ్రహ్మయ్య, మున్నెల్లి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కనిగిరిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పలు సంఘాలు

పరిసరాల శుభ్రతతో స్వచ్ఛ గ్రామాలు

సీఎస్‌పురం (పామూరు): పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా స్వచ్ఛ గ్రామాల నిర్మాణం సాధ్యమవుతుందని కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ పి.శ్రీవిద్య అన్నారు. జాతీయ సేవా పథకం ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కళాశాల విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా కళాశాల, సమీపంలోని పాఠశాలల్లో కంపచెట్లు, ఇతర చెట్లను తొలగించారు. అదేవిధంగా కాల్వల్లో బ్లీచింగ్ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కనిగిరి విద్యార్థులు



జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

కనిగిరిరూరల్: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కనిగిరికి చెందిన నల్గురు విద్యార్థినులు ఎంపికై నట్లు కోచ్, ఖోఖో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ కాశీవిశ్వనాథరెడ్డి తెలిపారు. ఈనెల 30 నుంచి వచ్చేనెల 5 వరకు ఢిల్లీలోని ఛత్రసాల్‌లో జరిగే 67వ అండర్ 19 జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీల్లో కనిగిరి ఖోఖో అకాడమికి చెందిన, ఎమ్మెస్సార్ బాలికల కళాశాలకు చెందిన కే వర్షిని, ఆర్ యశోధ, ఏ పురందేశ్వరి, ఎం సుమతిలు ఏపీ జట్టుకు ఎంపికయ్యారు. వీరు గతంలో రాష్ట్రస్థాయిలో చిత్తూరులోని పుత్తురులో జరిగిన ఖోఖో పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా తరపున ఆడి వరుసగా మూడేళ్ల ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర టీంలో మొత్తం 12 మంది ఉండగా అందులో కనిగిరికి చెందిన నల్గురు కావడం విశేషం. ఈమేరకు విద్యార్థినులను శుక్రవారం ప్రిన్సిపాల్ టీ వెంకట రెడ్డి, ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఖోఖో సంఘ రాష్ట్ర, జిల్లా నాయకులు అభినందించారు.

వెంటాడుతున్న గ్రామ సింహాలు



మెయిన్ రోడ్ లో రాత్రి వేళ రోడ్డుకు అడ్డంగా ఉన్న కుక్కలు

కొండపి: కుక్కల దెబ్బకు పంచాయతీలోని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రి వేళలో ద్విచక్ర వాహనదారులు వెంబడిపడి పలువురు గాయపడడానికి కుక్కలు కారణమవుతున్నాయి. కొండపి పంచాయతీలో ఏ వీధిలో చూసినా ఐదారు కుక్కలు సంచరిస్తూ ప్రజలను ఇబ్బందికి గురి చేస్తున్నాయి. రాత్రి వేళలో అయితే వాహనదారులను వెంబడిస్తూ వాహనదారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రాత్రి వేళలో 9 గంటలు దాటితే కొండపి టౌన్‌లో వ్యాపారులు షాపులు మూసివేయడంతో షాపుల ముందర, వీధులలో తిష్ట వేస్తున్నాయి. రాత్రి వేళలో కుక్కలు వాహనదారుల వెంటపడటంతో భయాందోళనలో ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలపాలైన సందర్భాలు కోకోల్లలుగా ఉన్నాయి. రోజుకొక వాహనదారుడైన గాయపడిన సందర్భం లేకపోలేదు. ఆదేవిధంగా పెద్ద వాహనాలను వెంబడించి టైర్ల కింద పడి కుక్కలు మరణించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఉదయాన్నే వాకింగ్‌కి వెళ్లే వాకర్ల వెంట కుక్కలు వెంబడబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కోరుకుంటున్నారు.

వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుల ఎంపిక



మసనం వెంకట్రావు



పిన్నిక శ్రీనివాసులు



చింతపల్లి హరిబాబు



ఇంకొల్లు సుబ్బారెడ్డి



దద్దుకుంట మల్లికార్జునరెడ్డి



బచ్చల కోటేశ్వరరావు

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ మండల పార్టీ అధ్యక్షులను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సింగరాయకొండ మండలానికి సింగరాయకొండకు చెందిన మసనం వెంకట్రావు, జరుగుమల్లి మండలానికి పంగులూరివారిపాలేనికి చెందిన పిన్నిక శ్రీనివాసులు, టంగుటూరు మండలానికి జమ్ములపాలెం గ్రామానికి చెందిన చింతపల్లి హరిబాబు, మర్రిపూడి మండలానికి మర్రిపూడి గ్రామానికి చెందిన ఇంకొల్లు సుబ్బారెడ్డి, పొన్నలూరు మండలానికి పైరెడ్డిపాలెం గ్రామానికి చెందిన దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి, కొండపి మండలానికి మూగచింతల గ్రామానికి చెందిన బచ్చల కోటేశ్వరరావులు నియమితులయ్యారు.

15 రోజులుగా తాగునీరు కట్..!

- హెచ్‌ఎంపాడు మండలంలో గొంతెండుతున్న గ్రామాలు
- అవస్థలు పడుతున్న ప్రజలు



హెచ్‌ఎంపాడులో ధ్వంసమైన సాగర్ పైపులు

హనుమంతునిపాడు: అసలే వేసవి.. ఆపై నీటి కొరత. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలో పలు గ్రామాలకు గత 15 రోజుల నుంచి సాగర్ నీరు అందడం లేదు. చందవరం ప్రాజెక్టు నుంచి మండలానికి సరఫరా అయ్యే ప్రధాన పైపులైన్లు పగిలిపోయాయి. హనుమంతునిపాడులో విద్యుత్ కాంట్రాక్టర్లు స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. జేసీబీతో స్తంభాలకు గుంతలు తీస్తుండటంతో మెయిన్ లైన్ల పైపులు పగిలి పోయాయి. వాటి మరమ్మతులు నేటికి చేయకపోవడంతో సాగర్ నీరు సరఫరా కావడం లేదు. హాజీపురం అడ్డ రోడ్డు ఓహెచ్ ట్యాంక్, సంప్ నుంచి హాజీపురం, కిష్టంపల్లి, దొడ్డిచింతల, మిట్టపాలెం, సీతారాంపురం, పాతమల్లవరం, కూటాగుండ్ల, దాసళ్లపల్లి, వీరాయిపల్లి వరకు నీటి సరఫరా నిలిచిపోయింది. మండల కేంద్రం నుంచి కొత్తూరు, ఆవులవారిపల్లి ఎలికవారిపల్లి, నీలకంఠాపురం, తిమ్మారెడ్డిపల్లి, నల్లగండ్ల, పెద్దగొల్లపల్లి, వాలిచర్ల, గాయంవారిపల్లి, మారెళ్లపల్లి, కిచ్చంపల్లి వరకు సాగర్ జలాలు అందక తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటు అధికారులు, అటు కాంట్రాక్టరు కూడా పట్టించుకోకపోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేయించి గొంతులు తడపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పలువురిని పరామర్శించిన సురేష్



డాక్టర్ శివరామిరెడ్డిని పరామర్శిస్తున్న ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: మండల వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్‌ను శుక్రవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పరామర్శించారు. మూలగుంటపాడు సర్పంచ్ డాక్టర్ బత్తుల శివరామిరెడ్డిని ఆస్పత్రి వద్ద మర్యాదపూర్వకంగా కలుసుకుని ప్రస్తుత రాజకీయ పరిస్థితిపై సమీక్షించారు. పార్టీ మాజీ మండల అధ్యక్షుడు తాండ్ర రామ్మూర్తి అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆస్పత్రిలో ఆయనను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అంతకుముందు బైపాస్ సర్జరీ చేయించుకున్న పాతసింగరాయకొండ ఎస్సీ కాలనీకి చెందిన పార్టీ నాయకుడు దాసరి శ్రీనివాసులును కలుసుకుని ధైర్యం చెప్పారు. పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా కిరణ్‌కుమార్, దాసరి శేషయ్య, షేక్ కరీం, చొప్పర శివ, షేక్ అల్లాభక్షు, గాలి బుజ్జి, సుదర్శి వెంకట్రావు, కొల్లూరి సాయికోటి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి నివాళులు



భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ, పార్టీ నేతలు

కనిగిరిరూరల్: మండలంలోని బొట్టికిర్లపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సింగంరెడ్డి బాలనారాయణరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. బాల నారాయణరెడ్డి భౌతిక కాయాన్ని శుక్రవారం వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు జీ ఆదినారాయణరెడ్డి, సింగంరెడ్డి పెద్ద నారాయణరెడ్డి, కేతు ఓబుల్ రెడ్డి, రామిరెడ్డి మండాది కృష్ణారెడ్డి, అట్లా రామచంద్రారెడ్డి, గంగవరం నాగార్జునరెడ్డి, సైకం స్వర్ణ ఏడుకొండలురెడ్డి, ఈర్ల శ్రీను, కంటు కేశవ తదితరులు పాల్గొన్నారు.

నేడు పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించనున్న దద్దాల

కనిగిరిరూరల్: స్థానిక పాదిలి రోడ్డులో గల పొగాకు వేలం కేంద్రాన్ని శనివారం వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ సందర్శించనున్నట్లు పార్టీ కార్యాలయ ప్రతినిధి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న శనివారం ఉదయం 9గంటలకు పొగాకు బోర్డు వద్దకు వెళ్లి వేలం జరుగుతున్న తీరును పరిశీలించి, గిట్టుబాటు ధర, ఇతర సమస్యలపై రైతులతో మాట్లాడుతారన్నారు. అనంతరం రైతులతో కలిసి, కంపెనీ ప్రతినిధులతో, బోర్డు అధికారులతో చర్చిస్తారని చెప్పారు. కావున రైతు ప్రతినిధులు, పార్టీ రైతు సంఘ, అనుబంధ సంఘ నాయకులు, అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.